క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని శివాయిపల్లి శివారులోని బీరప్ప ఆలయ ఆవరణలో శనివారం రెండో విడత బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళిపంతులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహార్యాలీకి తరలిరండి


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీరశైవ లింగాయత్‌లు

రేగోడ్(మెదక్): జూన్ 4న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన వీరశైవ లింగాయత్‌ల మహా ర్యాలీకి వీరశైవులంతా తరలిరావాలని బీజాపూర్ ఆశ్రమ పీఠాధిపతి అనిషానంద స్వామీజీ కోరారు. శుక్రవారం రేగోడ్‌లో ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరశైవుల సంక్షేమం కోసం తమ డిమాండ్లను ప్రభుత్వాలు నెరవేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు బిజిలిపురం చిన్న వీరప్ప, ఆర్.సుభాష్, టి.సంతోష్ కుమార్, వీరన్న, కోట సంగమేశ్వర్, కే.చంద్రశేఖర్, రాజు, నగేశ్, వీరప్ప, బసప్ప, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వీఆర్ఏల ఓటబంధు విధానం రద్దు చేయొద్దని చిలప్‌చెడ్ మండలంలో ఓటబంధు కలిగిన వీఆర్ఏలు శుక్రవారం తహసీల్దార్ ముసాద్దిక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వీఆర్ఏ అసలు దారులను క్రమబద్ధీకరించి, ఓటబంధు కలిగిన వీఆర్ఏలను విస్మరిస్తే, కొద్ది సంవత్సరాలుగా వీఆర్ఏలుగా విధులు నిర్వర్తిస్తున్న తమ బతుకులు ఆగమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు మన్నే విభిషన్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న నాగరాజుగౌడ్

నర్సాపూర్: తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నర్సాపూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు నాగరాజుగౌడ్ అంబలి పంపిణీ చేస్తున్నారు. ప్రతీ శుక్రవారం నర్సాపూర్‌లో అంగడి జరుగుతుందని, అంగడికి అనేక గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారని వేసవి దృష్ట్యా వారి దాహం తీర్చాలన్న ఉద్దేశ్యంతో తన తల్లిదండ్రులు కమలమ్మ, వెంకటస్వామిగౌడ్‌ల జ్ఞాపకార్థం మెయిన్‌రోడ్డుపై అంబలి పంపిణీ చేస్తున్నానని వివరించారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


సోమక్కపేట్‌లో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ స్రవంతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బెస్త స్రవంతి అన్నారు. శుక్రవారం వారు మండలంలోని సోమక్కపేట్ గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న రోగులకు కంటివెలుగు కార్యక్రమం ఓ వరం లాంటిది అన్నారు. కంటి సమస్యల పరిష్కారానికి నిపుణులైన వైద్యులే అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం నిల్వలు


వెల్దుర్తి(తూప్రాన్): అందుగులపల్లిలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని అందుగులపల్లి గ్రామంలో లారీల కొరతతో రైతులు రబీ సీజన్‌లో పండించిన ధాన్యం రాశులు కొనుగోలు కేంద్రంలోనే పేరుకుపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరుగాలం పంటలు పండించడం ఒక ఎత్తు అయితే ధాన్యాన్ని విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. ఐదు రోజులుగా లారీలు రాకపోవడంతో ఎండకు ఎండుతూ ధాన్యం నిల్వల వద్దే కాపలా ఉంటున్నామని రైతులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లారీల కొరతను తీర్చి ధాన్యం కొనుగోలు చేసుకొని రైతుల సమస్యను పరిష్కరించాలని గ్రామ రైతు నాయకుడు కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైతుల నిరసన

చేగుంట(తూప్రాన్): తూకం వేసిన ధాన్యం నిల్వ చేస్తామని హామీ ఇచ్చి రైస్‌మిల్ నిర్వాహకులు నిరాకరించడంతో రైతులు మక్కరాజీపేటలో శుక్రవారం సాయంత్రం రస్తారోకో చేశారు. మండలంలోని మక్కరాజీపేట కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం నిల్వ చేస్తామని లక్ష్మీబాలాజీ రైస్ మిల్ నిర్వాహకులు రెవెన్యూ కార్యాలయంలో ఒప్పుకున్నారు. శుక్రవారం రోజున 20 డీసీఎంల ధాన్యం దింపుకోవాల్సి ఉండగా రైస్‌మిల్ యజమానులు నిరాకరించడంతో రైతులు గ్రామంలో రస్తారోకో చేశారు. గ్రామానికి చేరుకున్న ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ రైస్ మిల్లు యజమానులను ధాన్యం దింపుకునేలా ఒప్పించడంతో రైతులు ధర్నా విరమించారు.

రైతులు అధైర్యపడొద్దు

పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి


తూప్రాన్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి

తూప్రాన్: రైతులు అధైర్య పడొద్దని, మండలంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 24,806 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేశామని ఆ సంఘం చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జ్ఞానజ్యోతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాల్లో 460 మంది రైతుల నుంచి 24,806.40 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. త్వరలోనే రైతులను పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల అధ్యక్షుడు చిట్కుల మహిపాల్ రెడ్డి, పాక్స్ సీఈఓ దినేశ్, రైతులు పాల్గొన్నారు.


పెద్దశంకరంపేట(మెదక్): రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ మమత

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏఈఓ మమత కోరారు. శుక్రవారం మండల పరిధిలోని జూకల్, వీరోజిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ధాన్యం ఎప్పటికప్పుడు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో శుక్రవారం ఆశ వర్కర్లు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ మేరకు ఎండలు అధికం అవడంతో ప్రజలు వడదెబ్బ గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంచుతూ అవి వాడుకునే విధానాన్ని తెలిపారు. ఎండలో వెళ్లేప్పుడు గొడుగు గానీ, టవల్ గానీ వాడుకోవాలని తెలిపారు. సోమవారం నస్కల్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంటి వెలుగు శిబిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్‌లు సంతోష, రేఖ, సంజీవ్, లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు


దీక్షలో రామాయంపేట వాసులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనకై రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు శుక్రవారం నాటికి 61 రోజులకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు దీక్షలు విరమించమని అఖిలపక్షం నేతలు పేర్కొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి


పేటలో సమ్మెలో వీఓఏలు

పెద్దశంకరంపేట(మెదక్): వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల వీఓఏల సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు. శుక్రవారం వీఓఏలు చేపట్టిన సమ్మె 40 రోజులకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్యబీమా సౌకర్యం, అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు రమ, స్వరూప, పుష్ప, విజయలక్ష్మి, శంకర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.


నిజాంపేట(మెదక్): ఏపీఎంను నిలదీస్తున్న బాలమణి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు వంటావార్పు నిర్వహించారు. ఈ మేరకు విధులకు హాజరవుతున్న ఏపీఎం వెంకట స్వామిని వీవోఏలు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, వీవోఏల మండల అధ్యక్షురాలు లలిత మాట్లాడుతూ.. వీవోఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. రామయంపేట వీఓఏ మండల అధ్యక్షురాలు అనిత, సెక్రటరీ రేణుక, సునీత, వీవోఏలు రామలక్ష్మి, లావణ్య రాజు, లక్ష్మి, లాజర్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్ దిశగా ముందుకెళ్లండి


ఉపాధ్యాయులతో విద్యార్థులు

మెదక్ జోన్: విద్యార్థులు బంగారు భవిష్యత్ దిశగా ముందుకెళ్లాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గణపతి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీఎస్సీ ప్రథమ, ద్వితీయ విద్యార్థులు ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫేర్వేల్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు దినకర్, సుధాకర్, వామనమూర్తి, రాజాగౌడ్, మురళి, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జీలుగు విత్తనాల పంపిణీ


జీలుగు బస్తాలు అందిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): సబ్సిడీపై జీలుగు బస్తాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, ఏఓ లావణ్య అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో సబ్సిడీ జీలుగు విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 కిలోల జీలుగు బస్తా ధర 2407 కాగా 65 శాతం సబ్సిడీపై 842 రూపాలయకు ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ప్రభుత్వం రైతులకు కావాల్సిన జీలుగు సబ్సిడీపై పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మధు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉపాధి పనులు ప్రారంభం**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని భీంరావుపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. వార్డు సభ్యుడు బోయిని భూషణం, గ్రామ పెద్దలు కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కాపు నర్సింలు, హరిదాస్, గోవర్ధన్, విజయ, పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

రామాయంపేట(మెదక్): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నార్సింగి మండలంలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు నాగరాజును శుక్రవారం బీఆర్ఎస్ గిరిజన నాయకులు తౌర్యానాయక్, బిక్యా నాయక్ పరామర్శించారు. వారు బాధితునికి ఆర్థిక సాయం అందజేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. శివ్వంపేటకు చెందిన ఉపాధ్యాయులు రమణరెడ్డి, దయకర్‌రెడ్డి తల్లి కౌసల్య అనారోగ్యంతో 6 రోజుల క్రితం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ **నాగదేవతకు విశేష పూజలు**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బస్వాపురం మల్లికార్జున ఆలయంలో కొలువైన నాగదేవత ఆలయంలో శుక్రవారం సంతానలక్ష్మి నాగ దేవతకు పురోహితులు విశేష పూజలు నిర్వహించారు. ప్రతీ నెల అశ్లేష నక్షత్రంలో ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు బసవప్ప తెలిపారు.

◆ **కాంగ్రెస్ మరింత బలోపేతం**

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని చిన్నశంకరంపేట ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ.. శశిధర్‌రెడ్డి రాకను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నుంచి దూరమైన నాయకులు శశిధర్‌రెడ్డి బాటలోనే తిరిగి కాంగ్రెస్‌కు రావాలని ఆయన కోరారు.

◆ **ధాన్యం రవాణాకు వాహనాలు**

నర్సాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించేందుకు రోజు వాహనాలు సమకూరుస్తున్నట్లు మండల తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ, పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు నర్సాపూర్ చౌరస్తాలో ఉంటు ఖాళీగా వస్తున్న లారీలు, డీసీఎంలు గుర్తించి కొనుగోలు కేంద్రాలకు పంపుతున్నామని ఆయన చెప్పారు. శుక్రవారం 8 వాహనాలు గుర్తించి అవసరం ఉన్న సెంటర్లకు పంపామని వివరించారు. ఆయన వెంట ఆర్ఐ ఫైజల్ ఉన్నారు.

◆ **నూతన బోరు మంజూరు**

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లోని బీసీ కాలనీ గవలవాడలో నీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ నాటికోటి సుప్రజా నూతన బోరును మంజూరి చేసి శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... కాలనీలో మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాకపోవడంతో నీటి సమస్య పరిష్కారానికై బోరు వేయించినట్లు తెలిపారు. వేసవిలో నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని కోరారు. ఇందులో నాయకులు కమ్మరి సిద్ధయ్య, కోటంగారి భూమేశ్, వడ్ల సత్యనారాయణ, భోగం సిద్ధయ్య, యాదగిరి, సంగయ్య, అశోక్, రమేశ్, సుధాకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

శివ్వంపేట(నర్సాపూర్): దివంగత నేత నర్సాపూర్ నియోజకవర్గ సమితి అధ్యక్షుడు నాయిని ప్రద్యుమ్నరెడ్డి భార్య నాయిని అనసూయమ్మ (90) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

◆ **గుండెపోటుతో కూలి మృతి**

శివ్వంపేట(నర్సాపూర్): గుండెపోటుతో కూలి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బోజ్యతండాలో చోటు చేసుకుంది. తండా వాసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తండాకు చెందిన శంకర్ నాయక్(28) కూలి పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు సుగుణ, స్వప్నతో పాటు చిన్న వయస్సు గల ముగ్గురు కొడుకులు ఉన్నారు.

వేతనాలు ఇవ్వరు.. వసతులు లేవు

కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): చట్టప్రకారం క్యాజువల్ కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం వేతనాలు, వసతులు కల్పించడం లేదని నిరసిస్తూ క్యాజువల్ కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. మండల పరిధిలోని సుగుణ ఫీడ్‌మిల్ ఇండస్ట్రీ క్యాజువల్ కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించడం లేదని నిరసిస్తూ విధులు బహిష్కరించి పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి సంఘీబావం తెలిపారు. క్యాజువల్ కార్మికులకు సరైన వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. చట్టప్రకారం క్యాజువల్ కార్మికులకు అందాల్సిన వసతులు, వేతనాలు అమలు చేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టానున్నట్లు చెప్పారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


నర్సాపూర్: మాట్లాడుతున్న మల్లేశ్‌గౌడ్


పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న విఠల్

నర్సాపూర్: బీజేపీ బలోపేతానికి అందరు సమష్టిగా కృషి చేయాలని పార్టీ నియోజవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ చెప్పారు. శుక్రవారం మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మత్స్యకారులు, ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం చెరువుల్లో వదులుతున్న చేప పిల్లల పథకం అమలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వమే చేప పిల్లలు అందచేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడాన్ని ఆయన ఖండించారు. అనేక పథకాల్లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వాటాను ప్రకటించడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కాగా పార్టీ కార్యక్రమంలో భాగంగా మహాజన్ సంపర్క్ కార్యక్రమాన్ని ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఎం మోదీ ఆధ్వర్యంలో 9 ఏళ్లలో భారతదేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బూత్ స్థాయి వరకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు జనసంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా బీజేపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతులను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తున్నారు అన్నారు. ఇప్పటి వరకు రైతులకు రుణ మాఫీ చేయలేదని, పంట నష్ట పరిహారం కూడా రైతులకు ఇవ్వలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు బండల శ్రావణ్, మంగలి కృష్ణ, బుగుడాల కృష్ణ, సాయిలు, నరేశ్, సుధాకర్, కుమార్, సురేశ్, సంగమేశ్వర్, శ్రీను, రాజు పటేల్, కిషన్, మాజీ ఎంపీటీసీ స్వప్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత


ఎల్ఓసీ అందజేస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఆమె శుక్రవారం హత్నూర మండలంలోని గోవింద్‌రాజ్ పల్లి గ్రామానికి చెందిన మొగులయ్యకు ఎల్ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. పేదలకు ఉపయోగకరంగా ఉన్న పథకానికి సీఎం నిరంతరం నిధులు కేటాయిస్తూ వారిని ఆదుకుంటున్నారని తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, గోపాల్, బాబు రాజ్, సాయికుమార్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉచిత తాగునీటి కేంద్రం ప్రారంభం


తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాత పరంజ్యోతి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ఉచిత తాగునీటి పంపిణీ కేంద్రాన్ని దాత అయిత పరంజ్యోతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని వారాంతం సంతలో ప్రజల సౌకర్యం కోసం ఉచిత మంచినీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కర్యాక్రమంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మి రఘురాంలుతో పాలు గ్రామ నాయకులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని దాయర వీధిలో శుక్రవారం పోలీసులు కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 63 ద్విచక్ర వాహనాలను 5 ఆటోలను 3 కార్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు చలాన్లు వేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వాహనాలకు ధ్రువ పత్రాలు ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, వాహనదారులకు సూచనలు ఇచ్చామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను జప్తిచేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మొత్తం 9795 పెండింగ్ చలాన్ క్లియర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లింగం, ఎస్ఐ జగన్నాథం, 20 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షం కలిగేనా ?

తూప్రాన్: నాలుగేళ్ల క్రితం సీఎం ఇచ్చిన హామీ ఇప్పటికీ నేరవేరడంలేదని మండలంలోని దాతర్‌పల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామస్తులు రోడ్డును త్వరగా పూర్తి చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2018 ఆగస్టు 15న కంటివెలుగు కార్యక్రమాన్ని మండలంలోని మల్కాపూర్‌లో సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. సీఎం సభలో దతార్‌పల్లి గ్రామస్తులు తమ గ్రామం నుంచి మాసాయిపేట మండలం పోతిన్‌పల్లి వరకు బీటీ రోడ్డు కావాలని సీఎంను కోరారు. సభలో సానుకూలంగా స్పందించిన సీఎం త్వరలోనే రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు, నాయకులు స్పందించి త్వరగా రోడ్డు పూర్తి చేయాలని దతార్‌పల్లి గ్రామస్తులు కోరుతున్నారు.